మస్టర్ల మాయాజాలం!

- అక్రమాలకు నెలవుగా ఉపాధి హామీ పథకం
- మరణించిన కూలీలకు, పనులకు రాని వారికి మస్టర్లు
- ఫీల్డ్ అసిస్టెంట్లపై పర్యవేక్షణ కరువు
- ఏపీఓల బాధ్యతా రాహిత్యంతో కూలీలకు తీవ్ర నష్టం
- ప్రజావేదిక సాక్షిగా అక్రమాలు బహిర్గతం



తిరువూరులో ఉపాధి హామీ పథకం పనుల అవకతవకలపై సిబ్బందిని విచారణ చేస్తున్న డ్వామా అధికారులు (ఫైల్)



గంపలగూడెం మండలంలో సామాజిక తనిఖీ సభలో అవకతవకలు వెల్లడిస్తున్న ఆడిట్ బృందం (ఫైల్)

తిరువూరు: వ్యవసాయ పనులు లేని సమయంలో వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తిరువూరు నియోజకవర్గంలో దళారులకు వరమైంది. గత ఏడాది కాలంగా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను ఇష్టానుసారం తొలగిస్తున్న అధికారులు తమకు అనుకూలురైన వారిని నియమించుకుంటూ అక్రమాలకు తెరతీశారు. 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు కూటమి ప్రభుత్వంలో నెలకొన్న అవకతవకలను సోషల్ ఆడిట్ బృందం గ్రామాల వారీగా ప్రజావేదికలో వెల్లడించగా, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి అధికారులు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓలు, పీఓలుగా వ్యవహరించే ఎంపీడీఓలు కనీసం అటువైపు కన్నెత్తి చూడకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు పంపే నివేదికలపైనే ఆధారపడటంతో లక్షలాది రూపాయల నిధులు దారి మళ్లాయి.

మస్టర్ల దశలోనే..

ప్రతి రోజూ ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల హాజరు నమోదు చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు సాంకేతిక పరమైన లోపాలను అవకాశంగా తీసుకుని జాబ్ కార్డులో పేర్లు లేనివారు, గతంలో మరణించిన వారు, ఇతర ప్రాంతాల్లో నివసించేవారికి కూడా మస్టర్లు వేసి సొమ్ములు పక్కదారి పట్టించినట్లు సామాజిక తనిఖీలో బహిర్గతమైంది. తిరువూరు మండలంలోని వావిలాల తదితర గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా జాబ్‌కార్డు లేని వారికి సైతం అవకాశం కల్పించడం, ఎఫ్ఏలు వేసే హాజరును అధికారులు తనిఖీ చేయకపోవడంతో ఏడాది కాలంలో రూ.25 లక్షలకు పైగా అవకతవకలు జరిగినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు గుర్తించారు. ఇందులో రూ.6.25 లక్షల మేర సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీకి ఉత్తర్వులివ్వగా.. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధించారు. గంపలగూడెం మండలంలో సైతం లింగాల, ఊటుకూరు, రాజవరం, అమ్మిరెడ్డిగూడెం, సత్యాలపాడు తదితర గ్రామాల్లో లక్షల్లో అవకతవకలు జరగగా, ప్రజావేదికలో విచారించి బాధ్యులపై చర్యలకు సిఫారసు చేశారు. ఈ మండలంలో చేయని పనులకు కూడా బిల్లులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్‌లో గుర్తించారు. పెనుగొలనులో రూ.27 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు సోషల్ ఆడిట్ బృందం నివేదిక ఇవ్వగా బాధ్యులపై రూ.65 వేలు మాత్రమే జరిమానా విధించారు.

అధికారులు పర్యవేక్షించాలి



ఉపాధి హామీ పథకాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ఏడాదికి ఒకసారి సోషల్ ఆడిట్ నిర్వహించడం, ప్రజా వేదికలో రికవరీలు వేయడంతో సరిపెడుతుంటే అక్రమాలకు అడ్డు కట్ట ఎలా వేస్తారు? మస్టర్ల దశలోనే అవకతవకలు జరుగుతున్నందున పారదర్శకంగా పనులు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సొంబారు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి, తిరువూరు

అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలి



వ్యవసాయ కూలీల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం దళారులకు వరమవుతోంది. కూలీల పేరుతో సొమ్ములు దండుకుంటూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్న తిమింగలాలను గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిపై రెవెన్యూ రికవరీ చట్టం కింద కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలి.

– యరదేశి రామారావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు, తిరువూరు

ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో స్వామిదాసు దంపతులు

తిరువూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిశారు. తిరువూరు నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణ, పార్టీ గ్రామ, మండల కమిటీల ఏర్పాటుపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సూచనలిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సర్నాల తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వీరికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు.

దోమల నివారణ మందు పిచికారీ

మారేమండ(విస్సన్నపేట): తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ పరిధిలో మండలంలోని మారేమండ, కొండపర్వ గ్రామంలో దోమలు నివారణ మందు పిచికారీ చేయించామని మండల వైద్యాధికారి డాక్టర్ కె. శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఆయా గ్రామల సర్పంచ్‌లు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

120 మందికి వైద్య పరీక్షలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో కొండపల్లి బీకాలనీ ఆడిటోరియంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు ప్రారంభించి మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఏడాదిలో ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు తప్పనిసరి అని అన్నారు. వివిధ వైద్యశాలలకు చెందిన వైద్యులు మధుమేహం, బీపీ, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డెప్యూటీ కార్యదర్శి శ్రీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సి.నారాయణరెడ్డి జయంతి



జి.కొండూరు: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని గంగినేని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి రచనలను తెలుగు ఉపాధ్యాయుడు నాగరాజు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అమీర్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఆవరణ శుభ్రం

చాట్రాయి: ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయిన చనుబండ జెడ్పీ హైస్కూల్ ఆవరణను పూర్వ విద్యార్థులు యంత్రాలతో శుభ్రం చేయించారు. హైస్కూల్ ఆవరణలో ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు, గడ్డి పేరుకుపోయి పాములు సంచరిస్తున్నాయని 1982–83 బ్యాచ్ విద్యార్థి మోరంపూడి రమేష్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువెళ్లారు. ఆయన తోటి పూర్వ విద్యార్థులు వజ్రాల రాజ్‌గోపాల్, అత్తునూరి లక్ష్మి, జువ్వా భాస్కర్, గొల్లపల్లి నాగేశ్వరావులను సంప్రదించి యంత్రాలతో తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హైస్కూల్ చైర్మన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు యశ్వంత్ బొప్పుడికి పీహెచ్‌డీ లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మంగళవారం తెలిపారు. వీఐటీ–ఏపీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనకు గాను ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ బొప్పుడిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎస్. నాగార్జున రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఆర్టీసీ డిపోలో విస్తృత తనిఖీలు



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో బస్సుల కండీషన్, రికార్డుల నిర్వహణపై విజయవాడ జోన్–2 డెప్యూటీ మెకానికల్ ఇంజినీర్ బి.హారిక విస్తృత తనిఖీలు నిర్వహించారు. రెండు రోజులుగా జరిగిన తనిఖీలు మంగళవారంతో ముగిశాయి. వెహికల్ కండీషన్ మెరుగు పరిచేందుకు అవసరమైన సామగ్రి వినియోగాన్ని, గ్యారేజీ రికార్డులను పరిశీలించారు. పలు బస్సులను రోడ్డు టెస్ట్ చేశారు. వెహికల్స్ పరిశుభ్రత, జీరో బ్రేక్ డౌన్ సాధించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలు కానున్న నేపథ్యంలో ఆర్టీసీ సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. ఆమె వెంట డిపో మేనేజర్ వేణు, సిబ్బంది ఉన్నారు.

యూనిఫాం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని జూనియర్ కళాశాలకు చెందిన 52 మంది విద్యార్థులకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా వితరణతో యూనిఫాం అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం

జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు



ప్లాస్టిక్ వ్యర్థాల ష్రెడ్డర్ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణను, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మి కంపోస్ట్ పిట్స్, ప్లాస్టిక్ ష్రెడ్డర్ పనితీరు, డ్రై వేస్ట్ నిర్వహణ, చెత్త సేకరణ వాహనాలను తనిఖీ చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్, క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించారు. ఇటీవలి కాలంలో పంచాయతీ కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్, విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సునీత శర్మ, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరుల రక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

మైలవరం: ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే దిశగా విద్యార్థులతో కళాశాల ప్రాంగణంలో వివిధ రకాల పూలు, ఔషధ మొక్కలను మంగళవారం నాటించారు. చెట్లను, అడవులను నరకడం వలన ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు పెంచాలని చెప్పారు. వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని, పారిశ్రామిక వాడల నుంచి వెలువడే వ్యర్థాలను అరికట్టి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డీన్ ఆర్ అండ్ డీ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి. సత్యనారాయణ, ప్రకృతి క్లబ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ షాహిదా నీలోఫర్, డాక్టర్ వి. భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

శోభనాచలుడి ఆదాయానికి గండి



దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలు

ఆగిరిపల్లి: స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆదాయానికి కొందరు దుకాణదారులు గండి కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మెయిన్ రోడ్డులోని శోభనాచల స్వామివారి కల్యాణ మండపం వద్ద దేవస్థానానికి చెందిన 12 దుకాణాలు ఉన్నాయి. వారు నెలకు రూ.3 వేలు నామమాత్రపు అద్దె చెల్లిస్తున్నారు. దేవదాయ శాఖాధికారులు దుకాణాలపై చూసీ చూడనట్టుగా వ్యవహరించడంతో కొందరు దుకాణదారులు ఆ దుకాణాలను ఎక్కువ మొత్తంలో వేరే వ్యక్తులకు అద్దెకివ్వటం, రెండు దుకాణాలను ఐతే స్థానికేతరులకు తమ సొంత ఆస్తి లాగా లక్షలాది రూపాయలకు విక్రయించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో శోభనాచలుని దేవస్థానానికి సంబంధించి భారీగా ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణాల అద్దె విలువ పెంచి వేలంపాటలు నిర్వహించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కళాకారులు ప్రజలను జాగృతం చేయాలి



వడ్లమూడి చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న నాయకులు

నందిగామ రూరల్: ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించేలా కళాకారులు ప్రజలను జాగృతం చేయాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జీవీ రంగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాకవి వడ్లమూడి నాగేశ్వరరావు జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వడ్లమూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా ప్రజానీకాన్ని చైతన్యపరచటానికి దోహదపడాలన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, ప్రదర్శనల బకాయిలు అందించాలని కోరారు. అనంతరం ప్రజా నాట్యమండలి మండల కన్వీనర్‌గా దామోదర్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న యనమదల ఎస్టీ కాలనీ వాసులు

నూజివీడు: యనమదల ఎస్టీ కాలనీలో నెలకొన్న మంచినీరు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మహిళలు ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు జి. రాజు మాట్లాడుతూ మంచినీరు లేక, వీధిలైట్లు వెలగక, రహదారులు సరిగా లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డెక్కితేనైనా అధికారులు స్పందిస్తారనే ఆశతో ఆందోళనకు దిగామన్నారు. కనీస వసతులను కల్పించడంలో కూడా అధికారులు అశ్రద్ధగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డి. దుర్గాభవాని, ఎస్‌కే మస్తానీ, జె. సత్యవతి, సరస్వతి, ఎల్. చిట్టెమ్మ, రామాంజనేయులు, చంటి, గోపి, వేణు పాల్గొన్నారు.

పీఎం రోజ్‌గార్ యోజనపై అవగాహన



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ప్రధానమంత్రి వికాస్ భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. గుంటూరు ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ప్రభుదత్త పుష్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల ఉపాధి కల్పన పెంచేందుకు పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఆగస్టు నుంచి ఎవరైతే నూతన యూఏఎన్ నంబర్ తీసుకుంటారో వారు ఆరు నెలలు పని కొనసాగిస్తే ఒక నెల వేతనం నగదు ప్రోత్సాహంగా వారి అకౌంటులో రెండు దఫాలు వేస్తారని చెప్పారు. కార్మికులకు ఉపాధి మార్గాలు చూపించిన యాజమాన్యానికి కూడా నెలకు ఒక్కొక్క కార్మికునికి రూ.1000 నగదు ప్రోత్సాహం జమ చేస్తారన్నారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి విజయ కుమార్, కార్మికులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగ పంచమి

ముసునూరు: నాగపంచమి పండుగను భక్తులు మంగళవారం నిర్వహించారు. గోపవరం శివారు నాగేంద్రపురంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత, ప్రత్యక్ష సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, వలసపల్లిలోని నాగేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నాణ్యమైన ఆహార ఉత్పత్తులకు కృషి

ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ మాధవీలత

మైలవరం: పంట వైవిధ్యం, ఆహార వైవిధ్యాన్ని పెంచి నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ టి. మాధవీలత అన్నారు. మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు మండలాల వీహెచ్‌ఏలు, వీఏఏలు, ఏఈఓలు, ఎంపీఈఓలకు స్థానిక రైతు శిక్షణా కేంద్రంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం 9 సార్వత్రిక సూత్రాలను వివరించారు. ఏడీఓ(ఆర్) ఎం. శ్రీనివాసరావు ప్రీ మాన్యువల్ డ్రై సోయింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఈ విధానంపై రైతులకు అవగాహన కలిస్తూ ప్రోత్సహించాలన్నారు. డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ ట్రైనర్ జె.శాంతకుమారి, కె. రమాదేవి మాట్లాడుతూ ఏటీఎం మోడల్, ఎ. గ్రేడ్ మోడల్‌ను వివరించారు. రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా పుల్లూరు, జంగాలపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి ఎ. గ్రేడ్, ఏటీఎం మోడల్స్ వేసే విధానాన్ని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మైలవరం మండల వ్యవసాయాధికారి కె. సంధ్యారాణి, ఎంఏఓ జి.కొండూరు కేసీహెచ్ సూరిబాబు, హార్టికల్చర్ అధికారి ఎస్. అహ్మద్, ఏఓ టెక్నికల్ ఆర్. వాసదేవ్ పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: సారా విక్రయాలపై దాడులు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పీఎస్‌డీ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. పోలవరం గ్రామంలో జరిపిన దాడుల్లో మరియమ్మ అనే మహిళ వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్ఐ మస్తానరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ

విస్సన్నపేట: విద్యుత్ భారాన్ని పెంచే స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తాతకుంట్ల గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కి విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో పాత మీటర్లు తీసి వేసి కొత్తమీటర్లు ఏర్పాటు చేయాలని చూడటం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం వివక్ష

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర ధ్వజం



జి.కొండూరు: వసతి గృహాల్లో పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర అన్నారు. జి.కొండూరులో ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతి గృహాలను స్థానిక ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మతో కలిసి రవిచంద్ర మంగళవారం సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించి రవిచంద్ర మాట్లాడారు. జి.కొండూరులో వసతి గృహాల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. బెడ్లు లేక విద్యార్థులు నేలపైనే పడుకోవడం దారుణమన్నారు. వసతి గృహాల నిర్వహణకు రూ.143 కోట్లు కేటాయించామని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా వీరాంజనేయులు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కేటాయించిన రూ.143 కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారని మంత్రిని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వై.నందరెడ్డి, ఎంపీటీసీ యరమల విజయ శ్రీ, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, జిల్లా కార్యదర్శి ఎ.శ్రీరాం, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండలరావు, జి.కొండూరు మండల అధ్యక్షుడు జె.నాగ తేజ సాయి, లక్ష్మారెడ్డి, వంశీ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సంక్షేమం గాలికి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రవిచంద్ర విమర్శించారు. తిరువూరులోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఏడాదికాలంగా సంక్షేమ శాఖ నుంచి విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచలేదని, మరుగుదొడ్లు, స్నానపుగదులు అధ్వాన్నంగా ఉన్నాయని, దోమతెరలు, చాపలు, పెట్టెలు, దుప్పట్లు, గ్లాసులు కూడా విద్యార్థులకు పంపిణీ చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాళ్ల బాటలు వేసుకోవాలి

చాట్రాయి: వరి పైరులో కాళ్ల బాటలు వేసుకోవాలని వ్యవసాయాధికారి బి. శివ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం పోతనపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలి బాటలు ఉండడం వలన పైరుకు గాలి, వెలుతురు తగులుతుందని, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు అనువుగా ఉంటాయని చెప్పారు. రైతులు యూరియాకు బదులు నానో యూరియాను వినియోగించుకోవాలని సూచించారు. యూరియా ఎక్కువ వాడడం వలన భూమిలో సాంద్రత తగ్గుతుందన్నారు.